సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 16 । ఆగస్టు । 2025



రత్నగిరి.. భక్తజన ఝరి

శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని ఆలయం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసింది. తాగు నీరందక భక్తులు ఇబ్బందులు పడ్డారు.




డేంజరింగ్

సైబర్ నేరస్తులు అమాయక ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. పోలీసు అధికారుల మంటూ అపరిచిత ఫోన్‌కాల్స్‌తో బెదిరించి డబ్బు దండుకుంటున్నారు.

8లో

2.51 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 2,51,618 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. శుక్రవారం సాయంత్రం 10.50 అడుగులకు నీటి మట్టం చేరింది. గోదావరి డెల్టా కాలువలకు 3,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

డీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



ఫైనల్ అడ్మిషన్ లెటర్ అందిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో శుక్రవారం డీసెట్–2025 రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన జరిగిందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు తెలిపారు. 20 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు పరిశీలించిన అనంతరం ఫైనల్ అడ్మిషన్ లెటర్లు అందజేశామన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన శని, ఆదివారాలు కూడా కొనసాగుతాయని చెప్పారు.

'ఉచిత బస్సు' ప్రారంభం



నిడదవోలులో ఉచిత బస్సును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, శేషారావు

నిడదవోలు/రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్త్రీ శక్తి పథకం అమల్లో భాగంగా నిడదవోలు డిపో, రాజమహేంద్రవరం కాంప్లెక్స్‌లో శుక్రవారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు, ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు ప్రారంభించారు. తొలి జీరో ఫేర్ టికెట్‌ను మంత్రి మహిళలకు అందించారు. ఉచిత బస్సు ప్రయాణం చేసే బాలికలు, మహిళలు, యువతులు, ట్రాన్స్‌జెండర్లు ఆధార్, ఓటర్ కార్డు ఏదైనా గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో 186 ఉచిత బస్సులు ఏర్పాటు చేశామన్నారు. సూపర్ లగ్జరీ, నాన్ స్టాప్ బస్సులు మినహా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ కేటగిరీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ఏపీ ఎన్‌క్లేవ్ బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ పి.ప్రశాంతి, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల చైర్మన్లు పాల్గొన్నారు.

రత్నగిరికి బస్సు సమర్పణ

అన్నవరం దేవస్థానానికి బస్సు అందజేసిన అరబిందో ఫార్మా



అరబిందో ఫార్మా కంపెనీ అందజేసిన బస్సుకు పూజలు చేస్తున్న ఈఓ సుబ్బారావు

అన్నవరం: రత్నగిరి శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి అరబిందో ఫార్మాస్యూటికల్స్ రూ.32 లక్షలు విలువ చేసే బస్సును శుక్రవారం అందచేసింది. డీజిల్‌తో నడిచే ఈ బస్సులో 44 మంది భక్తులు ప్రయాణించవచ్చునని అధికారులు తెలిపారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఈ బస్సుకు లాంఛనంగా పూజలు చేసి ప్రారంభించారు.

వన దుర్గమ్మకు చండీహోమం

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మకు శుక్రవారం చండీ హోమం ఘనంగా ఘనంగా నిర్వహించారు. అలాగే ప్రధానాలయంలోని సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కొండదిగువన తొలి పావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి పండితులు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన చండీహోమం ప్రారంభించారు. అనంతరం 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. తరువాత అమ్మవార్లకు వేద పండితులు వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. అమ్మవారికి నిర్వహించిన హోమంలో 42 మంది భక్తులు పాల్గొన్నారు. సత్యదేవుని ప్రధాన ఆలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో, కనకదుర్గ అమ్మవారికి పరిచారకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించి నీరాజనమంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి తదితరులు



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన



గౌరవ వందనం సమర్పిస్తున్న దళం



దేశభక్తి భావాన్ని చాటిన విద్యార్థుల ప్రదర్శన

ప్రగతి పథంలో సాగేలా..

- సమష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి
- సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి
- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం
- మహనీయుల త్యాగాలు మరువలేనివి
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్
- ఘనంగా 79వ స్వాతంత్ర్య వేడుకలు
- ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు



స్వాతంత్ర్య వేడుకల్లో జాతీయ జెండాలు చేతపట్టుకుని ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

సాక్షి, రాజమహేంద్రవరం: 'ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలందరి సమష్టి కృషితో తూర్పు గోదావరి జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపిద్దాం. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందించి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడదాం. ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ స్వర్ణాంధ్ర ప్రదేశ్ దిశగా ముందడుగు వేద్దాం' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వివిధ దళాల కవాతు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పోలీసు వాహనంపై మంత్రి, కలెక్టర్, ఎస్పీ కవాతు చేపట్టారు. అంతకు ముందు మంత్రి దుర్గేష్ స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను ఆర్ట్స్ కళాశాలలో ప్రత్యక్షంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి ప్రసంగించారు. ఎందరో నాయకులు, స్వాతంత్ర సమరయోధులు, అమరవీరుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. ఆ మహనీయుల త్యాగాలను స్మరిస్తూ.. ఘన నివాళులు అర్పిస్తున్నామన్నారు. బ్రిటిష్ పాలనలో దేశం ఆర్థిక దోపిడీకి గురైందన్నారు. ఆ పరిస్థితి నుంచి ప్రస్తుతం 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రపంచంలోనే అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థ సాధన దిశగా అడుగులేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని 2047 నాటికి స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు వెల్లడించారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. పేదరిక నిర్మూలన, ఆర్థిక అసమానతలు తొలగించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో పీ–4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మార్గదర్శులతో బంగారు కుటుంబాలను అనుసంధానిస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. 'సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కార్యక్రమం ద్వారా రూ.15 వేల ఆర్థిక తోడ్పాటు, ప్రతి ఏటా రైతుకు అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.20 వేల పెట్టుబడి సాయం, అర్హులైన మహిళలందరికీ ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు వంటి వాటిని అమలు చేశాం. మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యాన్ని అమలు చేస్తున్నాం' అని వివరించారు.

ఆయన ప్రసంగంలో ముఖ్యాంశాలివీ..

- రాబోయే కాలంలో యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు, ఉద్యోగం లేని నిరుద్యోగులకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి, మహాశక్తి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయం వంటి వాటిని రానున్న రోజుల్లో అమలు చేస్తాం. ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద 17 కేటగిరీల లబ్ధిదారులకు ఇంటివద్దనే పింఛన్లు అందిస్తున్నాం.
- పేదల ఆకలి తీర్చే ఐదు అన్నా క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చాం. త్వరలో మరిన్ని ప్రారంభించనున్నాం.
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం ద్వారా ప్రజాసమస్యలకు జవాబుదారీతనంతో కూడిన సత్వర పరిష్కారాన్ని అందిస్తున్నాం.
- ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాం.
- హర్ ఘర్ తిరంగా వంటి వినూత్న కార్యక్రమాలతో జాతీయ స్ఫూర్తిని పెంపొందించేలా వాడవాడలా పలు కార్యక్రమాలు చేపట్టి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాం.
- చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యం కలిగిన జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరాన్ని పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తున్నాం.
- అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో తొలి విడతలో 1.14 లక్షల రైతులకు రూ.57.50 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద 20వ విడతలో 1.03 లక్షల మందికి రూ.20.76 కోట్ల సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశాం.
- జిల్లాలో 40,261 మంది రైతులు 16,406 హెక్టార్లలో ప్రకృతి సేద్యం చేస్తున్నారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో రూ.307 కోట్ల పంట ఋణాలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 3,193 మంది రైతులకు రూ.13 కోట్ల ఋణాలు అందించాం.
- పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లోని రైతులతో సమావేశమై, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు.
- జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. జిల్లాలో వివిధ ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల కోసం రూ.12.41 కోట్ల పనులు చేపట్టనున్నాం.
- ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద 17 కేటగిరీల్లో 2,,36,331 మందికి రూ.103.26 కోట్లు ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్ద పంపిణీ చేస్తున్నాం.
- జిల్లాలో ఇప్పటివరకు 36.24 లక్షల టన్నుల ఇసుకను ప్రజలకు ఉచితంగా సరఫరా చేసి, రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. వర్షాకాలంలో ఇసుక కొరత అధిగమించేందుకు జిల్లాలో 29 స్టాక్ పాయింట్ల ద్వారా సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేశాం.
- మహిళలు, బాలికల భద్రత, రక్షణ కోసం పోలీసు వ్యవస్థను అప్రమత్తం చేసి, నిఘా వ్యవస్థను మరింత పెంచాం. న్యాయ వ్యవస్థ ద్వారా జిల్లాలో సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, వివిధ శాఖల అధికారులకు, సిబ్బందికి, పేదరిక నిర్మూలనకు సహకరిస్తున్న బ్యాంకు అధికారులకు అభినందనలు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిషోర్, జేసీ చినరాముడు, ఆర్డీఓ కృష్ణనాయక్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు

భారత స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తిని రేకెత్తించాయి. చిన్నారుల నుంచి ఉన్నత పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దేశభక్తి, ఐక్యత, త్యాగం, సాంస్కృతిక సంపదల విలువలను ప్రతిబింబించే ప్రదర్శనలు చేశారు. అంగన్‌వాడీ పిల్లల ఫ్యాషన్ షో ఆకట్టుకుంది.

విజేతలు వీరే..

శ్రీగౌతమి ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రథమ, ఆనందనగర్ మున్సిపల్ స్కూల్ ద్వితీయ, ట్రిప్స్ స్కూల్ తృతీయ స్థానాలు పొందాయి. ప్రత్యేక కన్సొలేషన్ బహుమతులు సాంఘిక సంక్షేమ పాఠశాల, అంగన్‌వాడీ బాలలకు, యోగా సాధన చేసిన కార్తీక్‌రెడ్డికి అందించారు.

వివిధ దళాల కవాతు

స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ దళాల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కవాతుకు పరేడ్ కమాండర్‌గా డీఎస్పీ టీవీఆర్‌కే కుమార్ నాయకత్వం వహించారు. 1996లో రిజర్వ్ ఎస్సైగా చేరి, 2010లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా, 2024లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. గతంలో గ్రేహౌండ్స్‌లో పనిచేసిన ఈయన 46 సేవా గుర్తింపులు, 17 నగదు బహుమతులు, 2 ప్రతిభా పత్రాలు, 21 ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ కవాతులో సన్మాన్ గార్డ్, సివిల్ పురుషులు, ట్రాఫిక్, సివిల్ మహిళలు, హోం గార్డులు, ఎన్‌సీసీ బాలికలు, యువ రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ బాలుర దళాలు పాల్గొన్నాయి.

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు సన్మానం

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంత్రి దుర్గేష్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను ఆర్ట్స్ కళాశాలలో కలుసుకుని, శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య యోధుల వారసులను గౌరవించడం అందరి కర్తవ్యమన్నారు. ప్రభుత్వ, సమాజ పరంగా వీరికి ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. శ్రీరంగపట్నానికి చెందిన ఆకెట్ల గంగరాముడు కుమార్తె చావలి రామలక్ష్మి, దోసకాయలపల్లికి చెందిన నెక్కంటి చంద్రవతి కుటుంబ సభ్యులు నెక్కంటి ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, బలరాం, రాజమహేంద్రవరానికి చెందిన క్రొవ్విడి లింగరాజు మనవడు భాస్కరరావు, కారుమూరి మార్కండేయులు కుమారుడు నాగవిశ్వనాథం ఉన్నారు. వీరందరినీ మంత్రి సన్మానించారు.



స్వాతంత్ర్య సమరయోధుల బంధువును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. మొత్తం 12 శకటాలు పాల్గొనగా, విద్యుత్ సంస్థ శకటం ప్రథమ స్థానం సాధించగా, వ్యవసాయం–హార్టికల్చర్ ద్వితీయ, సాంఘిక సంక్షేమ శాఖ తృతీయ, పశు సంవర్ధక శాఖ నాలుగు, పర్యాటక శాఖ శకటం ఐదో స్థానం సాధించాయి. విద్యా శాఖ, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ శాఖ, ప్రణాళిక పీ–4 శకటాలు, వైద్యారోగ్య శాఖ, అగ్నిమాపక సంస్థ శకటాలు వినూత్న అలంకరణతో ఆకట్టుకున్నాయి.







స్వాతంత్ర్య వేడుకల్లో నిర్వహించిన ప్రదర్శనలో బహుమతులు పొందిన విద్యుత్ సంస్థ, వ్యవసాయ–ఉద్యాన శాఖ, సాంఘిక సంక్షేమ శాఖల శకటాలు

పురస్కార గ్రహీతలు వీరే..



స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డీఆర్‌వో సీతారామ్మూర్తి



పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ సరళవందనం



కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మిత



సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు



ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య



నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్



డీఎస్‌వో పి.పార్వతి



డీఈవో కె.వాసుదేవరావు



డీవీఈవో డి.విద్యశ్రీ



ఇంటర్మీడియెట్ ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం



జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈవీ సుబ్బారావు



ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్



ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్



ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎస్‌బీవీ రెడ్డి



పంచాయతీరాజ్ ఎస్ఈ కె.బాలకృష్ణ



ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.వెంకటగిరి



జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారి ఎస్.భాస్కరరెడ్డి



డీపీఆర్‌వో లక్ష్మీనారాయణ



జిల్లా సహాయ కార్మిక శాఖ కమిషనర్ బీఎస్ఎం వలీ



డీఎంహెచ్‌వో డా.కె.వెంకటేశ్వరరావు



జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.మాధవరావు



జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా.టి.శ్రీనివాసరావు



జిల్లా పరిశ్రమల శాఖాధికారి వాణీధర్‌రమన్



జిల్లా రవాణా శాఖాధికారి ఆర్.సురేష్

క్లుప్తంగా

ఉపకార వేతనాల పంపిణీ


ఉపకార వేతనాలు అందజేస్తున్న డీడీ శోభారాణి, ఆర్‌ఎం గణేష్

బాలాజీచెరువు: సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా శనివారం కెనరా బ్యాంక్ రీజనల్ ఆఫీసులో 66 మంది విద్యార్థినులకు ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమానికి సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్ ఆర్.గణేష్ హాజరై ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కెనరా బ్యాంక్ అందజేస్తున్న విద్యాజ్యోతి పథకం, బ్యాంక్ సేవలు, రుణాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బంధువుల చెంతకు బాలుడు


బాలుడిని మేనమామకు అప్పగిస్తున్న ఎస్సై వీరబాబు

కాకినాడ రూరల్: ఇంటి నుంచి తప్పిపోయి తూరంగి గ్రామంలో కనిపించిన బాలుడిని ఇంద్రపాలెం పోలీసులు బంధువులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. తల్లిదండ్రులు ఉపాధి కోసం హైదరాబాద్‌లో మకాం ఉంటున్నారు. దీంతో తాళ్లరేవు మండలం సుంకటరేవు గ్రామంలో అమ్మమ్మ ఇంటి వద్ద పదేళ్ల పలివెల నందకుమార్ ఉంటూ ఐదో తరగతి చదువుతున్నాడు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్కూల్‌లో సెలవు ఇవ్వడంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలుడు తూరంగి తూరంగేశ్వరస్వామి ఆలయం సమీపంలో తారసపడ్డాడు. అనుమానాస్పదంగా తచ్చాడుతున్న బాలుడిని ఆటో డ్రైవర్ అద్దంకి పురుషోత్తమరావు ప్రశ్నించగా, పొంతన లేని సమాధానం చెప్పడంతో ఇంద్రపాలెం పోలీసులకు అప్పగించారు. ఎస్సై వీరబాబు, సిబ్బంది ఆ బాలుడి నుంచి వివరాలు సేకరించి, అతడి మేనమామకు శుక్రవారం రాత్రి అప్పగించారు.

డేంజరింగ్

- పోలీస్ డీపీలతో ఫోన్‌కాల్ చేసి బెదిరింపులు
- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- భయకంపితులవుతున్న అమాయక ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



రాయవరం: హలో.. నేను సీబీఐ ఆఫీసర్‌ని. మీ అబ్బాయి హరీష్ కదూ. మీ అబ్బాయి సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నాడు కదా. ఏ కంపెనీలో పని చేస్తున్నాడు? అంటూ ఓ ఫోన్‌కాల్. ఇటువైపు వ్యక్తి సమాధానాలు చెప్పగానే.. మీ అబ్బాయి డ్రగ్స్ విక్రయిస్తూ మాకు పట్టుబడ్డాడు. పది నిమిషాల్లో మా దగ్గరికి వస్తే వదిలేస్తాం.. లేదంటే.. అంటూ హిందీలో ఆ వ్యక్తి బెదిరింపు ధోరణి సంభాషణ. ఇటీవల రాయవరం గ్రామానికి చెందిన తండ్రి సత్తిబాబు(మార్చిన పేరు)కు వచ్చిన ఫేక్ ఫోన్‌కాల్ అది. ఆందోళన చెందిన సత్తిబాబు ఫోన్ కట్ చేయగా, మళ్లీ అవతలి వ్యక్తి ఫోన్ చేసి.. ఎందుకు కాల్ కట్ చేశావంటూ గట్టిగా బెదిరించాడు. దీంతో బిత్తరపోయిన సత్తిబాబు వెంటనే వాళ్ల అబ్బాయికి ఫోన్ చేయగా, తాను కంపెనీలో బీజీగా ఉన్నానని చెప్పగానే ఆయన తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. ఇలా ఒక్క సత్తిబాబుకే కాదు. గ్రామంలో మరికొందరికి ఇటువంటి ఫేక్ ఫోన్‌కాల్స్ వస్తూనే ఉన్నాయి. అలాగే అమలాపురం పట్టణానికి చెందిన ఓ వ్యక్తికీ ఇలాగే పోలీస్ డీపీతో ఉన్న ఫోన్ నంబర్ నుంచి సీబీఐ డీఎస్పీని మాట్లాడుతున్నానంటూ డబ్బు డిమాండ్ చేశారు. మరో వ్యక్తికీ ఇలాంటి ఫేక్ పోలీస్ డీపీతో ఫోన్‌కాల్ వచ్చినట్టు సమాచారం.

నేరగాళ్ల కొత్త పుంతలు

లాటరీలో రూ.లక్షలు తగిలాయని, అకౌంట్‌లో జమ చేయాలంటే ట్యాక్స్ రూపంలో కొంత డబ్బు చెల్లించాల్సి ఉంటుందంటూ.. గతంలో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడిన సంఘటనలున్నాయి. అలాగే న్యూడ్ కాల్స్ చేసి సొమ్ము వసూలు చేసిన సంఘటనలూ అనేకం ఉన్నాయి. ఇలా సైబర్ నేరగాళ్లు తమ మోసాలకు కొత్తదారులను మారుస్తూనే ఉన్నారు. తాజాగా పోలీసు ఫొటోలను డీపీగా పెట్టుకుని మోసాలకు తెరదీశారు. పోలీసులమని నమ్మించేందుకు వాట్సాప్ డీపీల్లో పోలీసు ఫొటోలను పెట్టి ఫోన్‌కాల్స్ చేస్తున్నారు. ఇదంతా నిజమేననుకుని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఫేక్ కాల్ అని కట్ చేసినా.. పదే పదే ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. కూతురు, కొడుకు, భర్త అంటూ పేర్లతో సహా వివరాలు చెబుతుండడంతో బాధితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అనంతరం కొందరు తేరుకుని తమ వారికి ఫోన్ చేసి, వాస్తవాన్ని నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎక్కువగా అమాయకులే బాధితులుగా మారుతున్నారు.

అపరిచిత కాల్స్ వస్తే..

ఎవరైనా అపరిచిత వ్యక్తులు వాట్సాప్ లేదా సాధారణ ఫోన్‌కాల్ చేసి.. పోలీసులమని చెప్పి బెదిరింపులకు పాల్పడినా, డబ్బు డిమాండ్ చేసినా.. మూడు పనులు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి కూతురు/కొడుకు లేదా ఇతర వ్యక్తి డ్రగ్స్ లేదా ఇతర కేసుల్లో పట్టుబడ్డాడని చెబితే.. ముందుగా తమ వారికి ఫోన్ చేసి నిర్ధారణ చేసుకోవాలంటున్నారు. అలాగే అపరిచిత ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేయాలి. చివరిగా టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడం లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో నేరుగా సంప్రదించాలని పోలీసులు చెబుతున్నారు. సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్న క్రమంలో సెల్‌ఫోన్లకు వచ్చే అపరిచిత కాల్స్, మెసేజ్‌లు, లింక్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని సూచిస్తున్నారు.

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

అమాయక ప్రజలే లక్ష్యంగా మోసాలకు పాల్పడేందుకు సైబర్ నేరగాళ్లు కొత్తదారులు ఎంచుకుంటున్నారు. ఏకంగా పోలీస్ డీపీలు వాడుకుని, వాట్సాప్, నార్మల్ కాల్స్ చేస్తూ, అమాయక ప్రజలను బెదిరిస్తూ, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ఉపాధి, ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం విదేశాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి కుటుంబాలే లక్ష్యంగా మోసాలకు యత్నిస్తున్నారు. ఇటీవల అనపర్తి మండలానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు పోలీసులమంటూ ఫోన్ చేసి, మీ కొడుకు డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడ్డాడు అని బెదిరింపులకు పాల్పడ్డారు. విడిచి పెట్టాలంటే డబ్బు పంపాలని చెప్పడంతో.. రూ.50 వేలు యూపీఐ ద్వారా పంపి మోసపోయారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకం వెలుగు చూస్తున్నాయి. సైబర్ నేరగాళ్ల బారిన పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుంటే, మరికొందరు మిన్నకుండిపోతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరగాళ్లు పోలీస్ డీపీలతో ఫోన్ చేసి మోసాలు, బెదిరింపులకు పాల్పడుతున్నట్టు మా దృష్టికి వచ్చింది. ఎవరైనా ఫోన్ చేసి మీ కుటుంబ సభ్యులు డ్రగ్స్ కేసులో పట్టుబడ్డారని బెదిరిస్తే ఆందోళన చెందకుండా, ముందు మీ సంబంధీకులకు ఫోన్ చేసి నిర్ధారించుకోవాలి. అపరిచిత ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసి, 1930 నంబర్‌కు రిపోర్ట్ చేయాలి. సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి.

– బి.రఘువీర్, డీఎస్పీ, రామచంద్రపురం

రత్నగిరి.. భక్తజన ఝురి


మంచినీరు లేక క్యూలో ఇబ్బందులు పడుతున్న భక్తులు


రూ.రెండు వేల వ్రత మంటపం వద్ద వేచి ఉన్న భక్తులు

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు
- స్వామివారి వ్రతాలు మూడు వేలు
- ఆదాయం రూ.40 లక్షలు
- మంచినీరు లేక క్యూలో అల్లాడిన భక్తజనం

అన్నవరం: శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని ఆలయం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసింది. సత్యదేవుని దర్శించేందుకు భక్తులు స్వామివారి ఆలయానికి భారీగా తరలివచ్చారు. దీనికితోడు రత్నగిరిపై, పలు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు కూడా జరుగుతుండడంతో.. పెళ్లి బృందాలు, నవ దంపతులు కూడా పెద్ద సంఖ్యలో విచ్చేశారు. గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులతో పాటు, హాజరైన పెళ్లి బృందాలు, ఇతర ప్రాంతాల్లో పెళ్లిళ్లు చేసుకున్న నవ దంపతులు భారీగా రత్నగిరికి తరలివచ్చారు. దీంతో స్వామివారి ఆలయం, వ్రత మంటపాలు, క్యూ లైన్లు, విశ్రాంతి మంటపాలన్నీ నవ దంపతులతో నిండిపోయాయి. సత్యదేవుని దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తుల రద్దీ కారణంగా ఉదయం 12 గంటల వరకు అంతరాలయ దర్శనం నిలిపివేశారు. వ్రతాల నిర్వహణ కోసం కూడా భక్తులు వ్రత మంటపాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించినట్టు దేవస్థాన వర్గాలు తెలిపాయి. స్వామివారి వ్రతాలు మూడు వేలు జరిగాయి. వివిధ విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

భక్తులకు అందని మంచినీరు

కాగా, శుక్రవారం రత్నగిరికి విచ్చేసిన భక్తులు క్యూ లైన్లలో మంచినీరు అందక అల్లాడిపోయారు. ఆలయం దిగువన క్యూలైన్లు ప్రారంభమయ్యే లిఫ్ట్ వద్ద, ఆలయం వద్ద ఉన్న క్యూ లైన్లలో సేవ చేయడానికి వచ్చిన వలంటీర్లు భక్తులకు మంచినీరు అందించేవారు. కానీ శుక్రవారం వారెవరూ కనిపించలేదు. ఆలయం వద్ద క్యూలైన్లలో ఖాళీ మంచినీటి పాత్రలు దర్శనమిచ్చాయి.

పిచ్చికుక్క స్వైర విహారం

ఎనిమిది మందికి గాయాలు


అనపర్తి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఆశీర్వాదం


గాయపడిన మరో మహిళ

బిక్కవోలు: మండల కేంద్రమైన బిక్కవోలులో శుక్రవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. కంట పడిన వారిపైకి దాడి చేయడంతో.. స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని కిరాణా షాపు నిర్వహించే వ్యాపారి దిగవల్లి సతీష్ వాహనం నుంచి సామాన్లను కిందకు దింపుతున్నాడు. ఈ క్రమంలో అక్కడున్న పిచ్చికుక్క ఆకస్మికంగా దాడి చేసి అతడి కాలు పట్టుకుంది. తర్వాత రాతి చెరువుపేటకు చెందిన చెలపాక ఆశీర్వాదం అనే మహిళ రోడ్డుపై నడిచి వెళ్తుండగా ఆమెపై దాడి చేసింది. అలాగే గ్రామానికి చెందిన రాంబాలపు నాగమణి, పెద్దబ్రహ్మదేవం గ్రామానికి చెందిన కంటిపూడి గోపాలం, కారి లక్ష్మి, శ్రీను, సత్యనారాయణ, సుమపై కూడా దాడి చేసింది. వీరందరికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ పాటు, ఇతర ఇంజెక్షన్లు ఇచ్చామని పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి తెలిపారు. తీవ్ర గాయాలైన నలుగురిని మెరుగైన వైద్యం కోసం అనపర్తి సీహెచ్‌సీకి పంపించినట్టు చెప్పారు.

వైద్యం కోసం వెళితే బైక్ చోరీ


అనపర్తి ఏరియా ఆస్పత్రి వద్ద బైక్‌ను తస్కరిస్తున్న దొంగ (నల్ల చొక్కా వ్యక్తి)

అనపర్తి: తన తల్లికి వైద్యం చేయించడానికి అనపర్తి ఏరియా ఆస్పత్రికి వస్తే బైక్ చోరీకి గురైందని బిక్కవోలుకు చెందిన చెలపాక బుజ్జి వాపోయారు. బిక్కవోలులో బుజ్జి తల్లి ఆశీర్వాదానికి బిక్కవోలులో కుక్క కరవడంతో గాయపడింది. ఆమెను వైద్యం చేయించడానికి బైక్‌పై తీసుకుని అనపర్తి ఏరియా ఆస్పత్రికి వచ్చాడు. మోటార్ బైక్‌ను ఆస్పత్రి ఆవరణలో ఉంచి లోపలకు వెళ్లారు. గంట తర్వాత చూడగా, బైక్ కనిపించలేదు. ఆస్పత్రి సిబ్బందికి విషయం చెప్పి, అక్కడున్న సీసీ కెమెరాలో పరిశీలించారు. దొంగ ఆ బైక్‌తో ఉడాయిస్తున్న దృశ్యం రికార్డ్ అయింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు బాధితుడు తెలిపారు.

వేలివెన్ను శశిలో ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు


జాతీయ జెండాను ఎగురవేస్తున్న విద్యాసంస్థల చైర్మన్ రవికుమార్

ఉండ్రాజవరం(నిడదవోలు రూరల్): ఎందరో మహనీయుల పోరాటం, త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. వేలివెన్ను శశి విద్యాసంస్థల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో ఆయన జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పోటీ పరీక్షల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ, డైరెక్టర్ శశి ప్రియ, మన్నెం వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ షేక్ షానూర్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం


హ్యాండ్ బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

రాజానగరం: దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సీబీఎస్ఈ సౌత్ జోన్–1 హ్యాండ్ బాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 18 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 1,200 మంది క్రీడాకారులు, 120 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరవుతున్నట్టు కరస్పాండెంట్ సీహెచ్ విజయప్రకాష్ తెలిపారు. తొలి రోజు పోటీల్లో శ్రీకృష్ణ ఇంటర్నేషనల్ స్కూల్ (చెన్నై), ది నంద్యాల పబ్లిక్ స్కూల్ (నంద్యాల), శ్రీప్రకాష్ విద్యా నికేతన్ (దివాన్‌చెరువు), కవి భారతి విద్యాలయం (చెన్నై) విజయం సాధించాయని స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.స్వామి తెలిపారు. కార్యక్రమంలో రివర్‌బే మూర్తి, టెక్నికల్ ఇన్‌చార్జి ఎస్.గోపీకృష్ణ, ప్రిన్సిపాల్ విమల, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ అధీనంలోకి వారాహి అమ్మవారు

సింగిల్ ట్రస్టీగా శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఈఓ సౌజన్య


కొవ్వూరులో వారాహి అమ్మవారిని దర్శించుకుంటున్న ఈఓ సౌజన్య

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వూరు గ్రామం వారాహి అమ్మవారు దేవదాయ శాఖ అధీనంలోకి వెళ్లారు. ఈ మేరకు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం అమ్మవారి ఆలయాన్ని అధీనంలోకి తీసుకుని, పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఈఓ ఎస్.సౌజన్యకు సింగిల్ ట్రస్టీగా బాధ్యతలు అప్పగించారు. వెంటనే ఆమె బాధ్యతలు స్వీకరించారు. కొవ్వూరులో వారాహి అమ్మవారిని అన్నాచెల్లెళ్లు కాళ్ల ప్రసన్నరాణి, పద్మలక్ష్మి, సత్యనారాయణ ఏడాది క్రితం స్థాపించారు. దర్శనం, పూజల కోసం భక్తులు విపరీతంగా పెరిగిపోయారు. సౌకర్యాలు లేక భక్తులు, గ్రామంలో ట్రాఫిక్ పెరిగిపోయి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయల విరాళాలు వస్తున్నాయని, అవి దుర్వినియోగం అవుతున్నట్టు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు అందడంతో, దీనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖను కలెక్టరు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎండోమెంట్ తనిఖీదారు విచారణ చేసి, నిర్వాహకులకు నోటీసు జారీ చేశారు. దీనిపై వారి నుంచి సమాధానం రాకపోవడంతో సింగిల్ ట్రస్టీగా ఈఓ సౌజన్యకు బాధ్యతను అప్పగించినట్టు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్రకుమార్ తెలిపారు.

వంచన కేసులో హోంగార్డు అరెస్ట్

ముమ్మిడివరం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మహిళను వంచించిన కేసులో హైవే పోలీస్ పెట్రోలింగ్ వాహనంపై విధులు నిర్వహిస్తున్న హోంగార్డును పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సై డి.జ్వాలా సాగర్ తెలిపిన వివరాల మేరకు, కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌లో హోంగార్డు బీర నాగరాజు హైవే పెట్రోలింగ్ వాహనంపై విధులు నిర్వహిస్తున్నాడు. ముమ్మిడివరానికి చెందిన యువతితో అతడు పరిచయం పెంచుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఎనిమిది నెలలుగా సన్నిహితంగా మెలిగాడు. తీరా పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఈ కేసులో నాగరాజును అరెస్టు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

చోరీ అయిన బంగారం కోసం దర్యాప్తు!

అమలాపురం టౌన్: పట్టణంలో దొంగ బంగారాన్ని కరిగిస్తున్న ఇద్దరి వ్యక్తులను అన్నవరం పోలీసులు విచారణ చేస్తున్నారు. దొంగల వద్ద వీరు దాదాపు 1,200 గ్రాముల బంగారాన్ని కొని, కరిగించారన్న సమాచారంతో అన్నవరం పోలీసులు ఇక్కడకు వచ్చి, రెండు రోజులుగా దర్యాప్తు చేస్తున్నారు. బంగారం కరిగించిన ఇద్దరు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నారు. రెండేళ్లుగా చోరీలు చేస్తున్న దొంగలు అన్నవరం పోలీసులకు పట్టుబడడంతో.. తీగ లాగితే డొంక కదిలినట్టు అమలాపురం దాకా వారి బాగోతం వెలుగు చూసినట్టు తెలిసింది. అమలాపురం పట్టణ పోలీసులను ఈ విషయమై విలేకర్లు అడగ్గా, దీనిపై తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు.

కోడి పందేలపై పోలీసుల దాడి


పెడపర్తిలో పోలీసుల అదుపులో జూదరులు

అనపర్తి: మండలంలోని పెడపర్తి గ్రామంలో శుక్రవారం కోడి పందేలపై పోలీసులు దాడి చేశారు. పందేలు ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.3,700 నగదు, మూడు కోడి పుంజులు, 12 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపారు. తమకు అందిన సమాచారంతో గ్రామ శివారులో పందేలపై తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

మద్యం స్వాధీనం, వ్యక్తి అరెస్ట్

సీతానగరం: కూనవరానికి చెందిన ఊట పద్మరాజు అనధికారికంగా మద్యం అమ్ముతుండగా అరెస్ట్ చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పోలీసులకు అందిన సమాచారంతో కూనవరంలో పద్మరాజు మద్యం సీసాలు అమ్ముతుండగా, ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. అతడిని అదుపులోకి తీసుకుని, 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,630 ఉంటుందని ఎస్సై చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

సగం కాలిన మృతదేహం గుర్తింపు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నగరంలోని ఇన్నీసుపేట కైలాసభూమి వెనుక సగం కాలిన మృతదేహాన్ని టూటౌన్ పోలీసులు శుక్రవారం కనుగొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడిని ధవళేశ్వరానికి చెందిన వాకాడ సతీష్‌కుమార్(22)గా గుర్తించారు. అతడు రైల్వే స్టేషన్‌లో సమోసాలు అమ్ముతుంటాడు. అర్ధరాత్రి దాటినా నిద్ర పోకుండా టీవీ చూస్తున్నాడని ఈ నెల 8వ తేదీన తండ్రి మందలించాడు. మర్నాడు ఉదయం తెల్లవారుజాము నుంచి సతీష్‌కుమార్ అదృశ్యమయ్యాడు. దీనిపై 11వ తేదీన కుటుంబ సభ్యులు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతదేహం సగం కాలి ఉండడంతో.. అతడిని ఎవరైనా హతమార్చారా అని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇదేం దేశభక్తి..!

పాదగయ క్షేత్రంలో స్వామివారికి అపచారం


పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామికి ప్లాస్టిక్ జెండాలతో చేసిన అలంకరణ

పిఠాపురం: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఆలయ సిబ్బంది జాతీయ జెండాలతో స్వామి వారికి అలంకరణ చేసి అపచారానికి పాల్పడ్డారు. పలు ఆలయాల్లో ఇలా అలంకరణలు చేసినప్పటికీ, త్రిగయల్లో ఒకటైన పాదగయ కుక్కుటేశ్వర స్వామివారి శివలింగం అతి ప్రాశస్త్యం కలిగి ఉంది. స్వామివారి గర్భ గుడిలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంది. అయినప్పటికీ ప్లాస్టిక్ జెండాలను స్వామికి అలంకరించారు. వీటన్నిటికంటే స్వామివారి త్రినేత్రం ఉండాల్సిన చోట జాతీయ జెండా అలంకరించడంపై భక్తులు మండిపడుతున్నారు. ఇది దేశభక్తా లేక పైత్యమా అంటూ ప్రశ్నిస్తున్నారు. దేశభక్తి ఉంటే వేరేవిధంగా చూపించాలి కానీ, ఇలా భగవంతుడితో పరాచకాలు ఏమిటని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సెంట్రల్ జైలులో పోస్టుల భర్తీ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోని డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్‌లో తాత్కాలిక ప్రాతిపదికన పోస్టులు భర్తీ చేయనున్నట్టు జైళ్ల శాఖ కోస్తాంధ్ర డీఐజీ ఎంఆర్ రవికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్‌లో ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్, అకౌంటెంట్ కమ్ క్లర్క్, మనస్తత్వవేత్త, కౌన్సిలర్, సామాజిక కార్యకర్త, నర్సు (పురుషుడు), వార్డ్ బాయ్, పీర్ ఎడ్యుకేటర్ పోస్టులు భర్తీ చేయనున్నామన్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. అర్హతలు, అనుభవం, వయో పరిమితి, గౌరవ వేతనం వంటి వివరాలు సెంట్రల్ జైలులోని నోటీసు బోర్డులో ఉంచామన్నారు. 21 నుంచి 35 ఏళ్లున్న వారు అర్హులన్నారు. పురుష అభ్యర్థులకు రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఎంపికైన వారు రోజుకు కనీసం 8 గంటలు డ్యూటీ చేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను రిక్రూట్‌మెంట్ చైర్మన్ కమ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ జైల్స్, కోస్టల్ ఆంధ్ర రేంజ్, గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా, హెచ్‌పీసీఎల్ అవుట్‌లెట్ పక్కన, రాజమహేంద్రవరం–533103, తూర్పుగోదావరి జిల్లా అనే చిరునామాకు పంపాలని తెలిపారు.

డీఎస్సీ తుది కీ విడుదల

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,241 పోస్టులు
- వివిధ సబ్జెక్టులకు 63,004 దరఖాస్తులు

రాయవరం: డీఎస్సీ–2025 ఫలితాల తుది కీ విడుదలైంది. ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకానికి పరీక్షలు నిర్వహించగా, అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది కీ విడుదల చేశారు. అనంతరం నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా రూపొందించిన తుది ఫలితాలను డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఈ నెల 11వ తేదీన విడుదల చేశారు. పాఠశాల విద్యా శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తుది ఫలితాలను, స్కోర్ కార్డులను అభ్యర్థులు పొందారు. టెట్ వివరాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే.. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో హాల్ టికెట్ నంబర్ ద్వారా ఎవరికి వారు సరిచేసుకునే అవకాశం శుక్రవారం సాయంత్రం ముగిసింది.

1,241 పోస్టులకు పరీక్షలు

నిరుద్యోగ ఉపాధ్యాయులు డీఎస్సీ–2025 పరీక్షలకు అభ్యర్థులు హోరాహోరీగా సన్నద్ధమయ్యారు. ఉపాధ్యాయ కొలువులో స్థిరపడాలన్న చిరకాల కలను సాకారం చేసుకునేందుకు కష్టపడి పరీక్షలకు హాజరయ్యారు. జూన్ ఆరో తేదీ నుంచి టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలను కోనసీమ జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల నేతృత్వంలో డీఈఓ డాక్టర్ షేక్ సలీం బాషా పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పరీక్ష కావడంతో కంప్యూటర్ సౌకర్యాలున్న కాట్రేనికోన మండలం చెయ్యేరులోని శ్రీనివాసా ఇంజినీరింగ్ కళాశాల, అమలాపురం భట్లపాలంలో ఉన్న బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,241 పోస్టులకు 38,617 మంది దరఖాస్తు చేశారు. వివిధ సబ్జెక్టులకు మొత్తం 63,004 మంది పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేయగా, వీరిలో 14,380 మంది పురుషులు, 24,237 మంది మహిళా అభ్యర్థులున్నారు.